క్లుప్తంగా

తక్కువ వడ్డీకే రుణాలు



రుణ అనుమతి పత్రాలు అందిస్తున్న బ్యాంకు రీజినల్ హెడ్ మనోహర్

బోట్‌క్లబ్: యూనియన్ బ్యాంక్‌లో అతి తక్కువ వడ్డీకే అన్ని రకాలు రుణాలు అందిస్తున్నామని బ్యాంకు రీజినల్ హెడ్ మనోహర్ అన్నారు. స్థానిక తిలక్‌వీధిలోని యూనియన్‌బ్యాంక్‌లో ఆదివారం మెగా రిటైల్ ఎక్స్‌పో నిర్వహించారు. గృహ రుణాలు, కారు, ఎడ్యుకేషన్, ప్రాపర్టీలోన్, వ్యక్తిగత రుణాలు అతి తక్కువ వడ్డీకి ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు రోజులుగా నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో పలువురు వినియోగదారులకు రుణాలు అందించేందుకు అనుమతి పత్రాలు అందించామని బ్యాంక్ హెడ్ అమర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిబ్బంది, వ్యాపారవేత్తలు, కార్ డీలర్లు పాల్గొన్నారు.

రసాయనిక మందుల పిచికారీలో అప్రమత్తం



కరపలో రసాయనిక మందులు పిచికారీ చేస్తున్న రైతు

కరప: పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు రసాయనిక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే విషప్రభావానికి లోనుకాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంఏఓ ఏవీ రాజేష్ సూచించారు. మండలంలో ఆదివారం ఆయన వీఏఏ ప్రశాంతితో కలసి కరప, పెనుగుదురు, కొరుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి రబీలో ఆశించే తెగుళ్ల వివరించి, రసాయనిక మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



మానవత్వం స్వచ్ఛంద సంస్థకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత యోగ

కరప: మండలం గురజనాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఆ సంస్థ కార్యాలయానికి పెనుగుదురు మాజీ సర్పంచ్ కొమ్మోజు శ్రీదేవి, శ్రీనివాస్‌ల కుమారుడు కొమ్మోజు యోగా రూ.10 వేలు విలువచేసే నాలుగు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ఆదివారం సంస్థ వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజుకు వాటిని అందజేశారు.

పెనుమర్తిలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ ధ్వంసం



పెనుమర్తిలో ధ్వంసమైన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీల చించివేత కలకలం రేపింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి నీచ సంస్కృతి లేదని, ఇప్పుడు ఇలా చేయడం బాధకరమని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లి పేరిట వేసిన ఫ్లెక్సీలు చించివేయడాన్ని ఖండిస్తున్నానని ఆయన తెలియజేశారు, ఇతర పార్టీలలో ఆకతాయలు పనే అయి ఉంటుందని, దీనిపై ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

వృథా ఖర్చులు కట్టడి చేయాలి

బాలాజీచెరువు: శుభ కార్యాల పేరుతో వృథా ఖర్చుకు అడ్డుకట్టవేయాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. జగన్నాథపురం చిల్డ్రన్ హోమ్‌లో పిల్లలకు అన్నదానం నిర్వహించారు.కొత్తపల్లి పీహెచ్ సిబ్బంది రవిబాబు సోదరి నూకరత్నం పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం ఏర్పాటుచేశారని, వివాహాలు, పుట్టినరోజుల పేరుతో వృథాఖర్చులను ఇటువంటి వాటికి కేటయిస్తే పేద పిల్లలను ఆదరించవచ్చన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో సోమవారం ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. జేఎన్‌టీయూకేతో అనుబంధ ఇంజినీరింగ్ ప్రైవేట్ కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయనున్నారు. శిబిరాన్ని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు రక్తదానం చేసి ప్రారంభించనున్నారు.



పార్కింగ్‌లోనే కూర్చొని సేద తీరుతున్న రోగుల సహాయకులు



తల్లీ పిల్ల బొమ్మ ఆవరణలో..



బిచ్చగాళ్లకు నిలయంగా మారిన అటెండర్ల షెడ్

నిర్వహణ లోపమే శాపం..

- రోగుల సహాయకుల అవస్థలు వర్ణనాతీతం
- ఎన్ని వసతులున్నా కొన్నాళ్లకే నిరుపయోగం
- రోగి వైద్యం కోసం పడరాని పాట్లు

కాకినాడ క్రైం: పేదల పాలిట సంజీవని కాకినాడ జీజీహెచ్. వైద్య రంగానికి ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలతో వైద్యులు అందిస్తున్న సేవల ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించింది. ఇలా ప్రభుత్వం ఎంత చేస్తున్నా నిర్వహణ లోపించడంతో రోగి పక్కన ఉండే సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. కుటుంబీకులు ఇచ్చే మానసిక ధైర్యాన్ని మించిన మందు లేదన్నది నిర్వివాదాంశం. రోగి కోలుకోవడంలో ఒకవైపు వైద్యం, మరో వైపు మనోధైర్యం సమాన పాత్ర పోషిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. వారికి ఆస్పత్రి యాజమాన్యం కల్పిస్తున్న వసతుల నిర్వహణ లోపాన్ని పరిశీలిస్తే అయ్యో పాపం అనిపించక మానదు.

కనీస వసతుల కొరత

స్నానపు గదులు, మరుగుదొడ్లు, భోజన శాల, రోజులో విశ్రాంతి తీసుకునేందుకు, కూర్చునేందుకు కనీసం కుర్చీలు, నిద్రించేందుకు పడక, ఫ్యాను వంటి కనీస వసతులు లేక రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నీ ఉండీ అగచాట్లు

ఆస్పత్రిలో ఎన్ని సదుపాయాలు సమకూర్చినా నిర్వహణలోపంతో అన్నీ మూలకు చేరి యాజమాన్యం వైఫల్యాన్ని చూపుతోంది. రూ.లక్షల విలువైన మౌలిక వసతులు ఉన్నా నేడు నిరుపయోగంగా మూలకు చేరినవెన్నో ఉన్నాయి.

అన్నింటికీ అవస్థలే

తీరిగ్గా కూర్చుని నాలుగు ముద్దలు తిందామంటే టేబుళ్లు ఉండవు. ఫ్యాన్లు ఉన్నా తిరగవు. స్నానపుగదులు, మరుగుదొడ్లు, నీటి వసతి మాటేలేదు.



జీజీహెచ్‌లోని ఓ వార్డులో అందరూ నడిచే మార్గం మధ్యలో నిద్రకు ఉపక్రమించిన రోగుల బంధువులు

ఉన్నా నిర్వహణ అధ్వానం. రాత్రివేళ అయితే రోగి పక్కనే కొంత జాగా చూసుకుని ముడంకె వేయాల్సిందే.

కంపు కొడుతూ అటెండర్ షెడ్

ఆరేళ్ల క్రితం నిర్మించిన అటెండర్ షెడ్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నిర్వహణ లేక దుర్వాసన వెదజల్లుతోంది. బిచ్చగాళ్లకు, శునకాలకు నిలయంగా ఆస్పత్రి ఆవరణ మారిపోయింది.

ఇలా చేస్తే మేలు

- జీజీహెచ్‌లో ఖాళీ ప్రదేశాల్లో చెక్క లేదా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రిలో నీడనిచ్చే చెట్ల పెంచాలి.
- ప్రతి వార్డు ఆవరణలో కుర్చీలు ఏర్పాటు చేయాలి.
- ఇప్పటికే ఉన్న కుర్చీలలో పాడైన వాటి మరమ్మతులు చేపట్టాలి.
- ప్రతి వార్డులో మంచి నీటి సదుపాయం కల్పించాలి.
- ఫ్యాన్లకు మరమ్మతులు, అదనపు ఫ్యాన్లు సమకూర్చాలి.
- రోగులకు సమీపంలో వారి బంధువులకు నిర్ణీత వ్యవధికి పడక ఏర్పాట్లు చేయాలి.
- రోగి పడక వద్దే బంధువులకు భోజనానికి ఏర్పాట్లు చేయాలి.
- కుక్కల నియంత్రణకు సత్వర చర్యలు తీసుకోవాలి.
- వీటన్నింటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలి.
- రోగుల బంధువుల సమస్యలు పరిష్కరించేలా స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకరించాలి.



ఓపీ పరిసరాల్లో ఫ్యాన్లు తిరగక రోగుల సహాయకుల అవస్థలు


వసతులు వినియోగంలోకి తెస్తాం



జీజీహెచ్‌లో రోగుల సహాయకుల సౌలభ్యం కోసం ఇప్పటికే ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలను పునర్వినియోగంలోకి తీసుకువస్తాం. అలాగే వాటి మరమ్మతులు పూర్తి చేసి వారం రోజుల వ్యవధిలో అందుబాటులోకి తెస్తాం. ఏఏ ప్రాంతాల్లో ఎటువంటి సదుపాయాలు అవసరమో పరిశీలిస్తాం. రోగులు, వారి సహాయకుల సదుపాయాల కల్పనలో భాగస్వాములవ్వాలనే స్వచ్ఛంద సంస్థలు లేదా దాతలు నేరుగా మమ్మల్ని సంప్రదించవచ్చు. తోడ్పాటు అందించిన వారి పేరును సమకూర్చిన సదుపాయాలపై ప్రచురిస్తాం.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, సూపరింటెండెంట్, జీజీహెచ్

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10.30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

మధుమేహం నివారణకు ప్రత్యేక దృష్టి



లయన్స్‌క్లబ్ సభ్యులకు కిట్లు అందజేస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: మధుమేహం నివారణకు లయన్స్ క్లబ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్టు లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న డయాబెటిక్ స్క్రీనింగ్ అవగాహన ఆదివారం లయన్స్ హాల్లో ప్రారంభించారు. రూ.1.3 కోట్లతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో రూ.43 లక్షలతో ఉమ్మడి తూర్పుగోదావరిలో 20 లయన్స్‌క్లబ్‌ల ద్వారా 30 వేల మందికి 100 వైద్య శిబిరాల ద్వారా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిచామన్నారు. పూర్వపు లయన్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు అన్ని విధాలా అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి హామీ
- కమ్యూనిటీ హాలు ప్రారంభం

కాకినాడ: రజక సామాజిక వర్గానికి అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక 44వ డివిజన్ శారదాదేవి ఆలయం ప్రాంతంలో రూ.99.6 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నిర్మించిన రజక కమ్యూనిటీ హాలు, గ్రౌండ్, మొదటి అంతస్తు కమ్యూనిటీహాలును ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎస్ఈ పి.సత్యకుమారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎంతో విలువైన స్థలాన్ని కబ్జాకు గురికాకుండా రజకులు కాపాడుకుంటూ వచ్చారని, ఆ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఆ స్థలానికి ప్రహరీ నిర్మించి రజకుల కోసం వృత్తిపరమైన సౌకర్యాలు కూడా కల్పించానన్నారు. కాకినాడ చీడీలపొర ప్రాంతంలో కూడా మరో కమ్యూనిటీహాలును నిర్మించామని, అక్కడ రూ.35 లక్షలతో అదనపు అతస్తు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు గూటాల రామకృష్ణ, రజక సంఘ ప్రతినిధులు పల్లంకి నూకరాజు, పొట్నూరి నారాయణరావు, గోడి వెంకట్, ఇరుసుమళ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి

కాకినాడ సిటీ: సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూకే ఆచార్యుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి, వీబీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన వివేకానంద పార్కు శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శాస్త్రంపై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు, కాంతి పాఠ్యాంశంపై సైన్స్ ప్రయోగాల శిక్షణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 28 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి, అపారమైన ప్రకృతి వనరుల వినియోగానికి సైన్స్ తోడ్పడుతుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, పరిశోధనలపై ప్రతి విద్యార్థీ ఆసక్తి పెంచుకోవాలన్నారు. విశ్రాంత స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దొమ్మేటి సుధాకర్ మాట్లాడుతూ, మూఢ నమ్మకాలు లేని ప్రపంచాన్ని నిర్మించాలని అన్నారు. శాఖా గ్రంథాలయ పరిపాలనాధికారి ఎం.శ్రీనివాసరావు కూడా ప్రసంగించారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, పిల్లి గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రయోగాలు చేసి చూపిస్తున్న వెంకట్రావు

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాల శిక్షణ

కాంతి పాఠ్యాంశంపై రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్, పాఠ్య పుస్తక రచయిత కె.వెంకట్రావు చేసిన 32 ప్రయోగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సమతలం, కుంభాకార, పుటాకార తలాలపై కాంతి పరావర్తనం, పరావర్తనాల్లో రకాలను తెలిపే కృత్యం, గాజుదిమ్మలో కాంతి వక్రీభవనం, కటకాల్లో రకాలను వివరించడం, కుంభాకార కటకాల్లో కాంతి ప్రయాణించడం, కుంభాకార కటకానికి వస్తువు వివిధ దూరాల్లో ఉన్నప్పుడు ప్రతిబింబాలు ఏర్పడటం, వాటి స్థానాలు, కంటిలో కటకం, రెటీనా పని తీరు వంటి వివిధ ప్రయోగాలు ప్రత్యక్షంగా చేసి చూపించారు.

క్లాస్–4 ఉద్యోగుల నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ: జిల్లా క్లాస్–4 ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ భవనంలో పి.దుర్గాప్రసాద్ ఎన్నికల అధికారిగా ఈ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కరప తహసీల్దార్ కార్యాలయ సబార్డినేట్ సవరపు చినపాపారావు ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా వాసంశెట్టి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా ధర్మవరపు శ్రీనివాసరావు, బాలిబోయిన గణేశ్వరరావు, కార్యదర్శి ఖండవిల్లి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా మానుపాటి వరలక్ష్మి, కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం 2027 ఫిబ్రవరి 24 వరకూ అమలులో ఉంటుందని అధ్యక్షుడు చిన పాపారావు తెలిపారు.

సర్పవరం భక్తజన సంద్రం

- ఘనంగా మాఘ ఆదివారపు తిరునాళ్లు
- భావనారాయణుని దర్శించిన వేలాది భక్తులు
- స్వామివారి సేవలో ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు



భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు

కాకినాడ రూరల్: నారద మహా ముని ప్రతిష్ఠించిన సర్పవరం క్షేత్రంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాస తిరునాళ్ల వైభవంగా జరుగుతున్నాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఆదివారం మూల భావనారాయణ స్వామి వెలసిన విశేష పర్వదినం కావడంతో సుమారు 30వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు ఆవు పిడకలతో పాలు పొంగించి, పొంగలి తయారు చేసి స్వామికి సమర్పించారు. వేలాదిగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ, భక్తులు, గ్రామ నాయకులు సహకారంతో అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు స్వామి వారిని దర్శించుకుని భక్తులకు స్వయంగా వడ్డించారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, చక్రధరరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఘన స్వాగతం పలికి, గజ మాలతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు.

కాగా ఈ క్షేత్రంలో భావనారాయణస్వామి వెలవడం స్థానికుల అదృష్టమని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సర్పవరంలో మాఘ మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి కంకణ బద్ధుడిగా ఉంటానన్నారు. సంవత్సరానికి రూ.25 లక్షల నుంచి 30 లక్షల వరకు ఆదాయం కలిగిన ఈ దేవస్థానానికి రెండేళ్లగా ఆదాయం పెరిగిందన్నారు. ఈ సంవత్సరం రూ.80 లక్షల వరకు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారన్నారు. స్వామి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి



విశేష అలంకరణలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి

బోట్‌క్లబ్: మాఘ ఆదివారం సందర్భంగా స్థానిక భానుగుడి భాను లింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలు నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

చికిత్స పొందుతూ ఎంపీటీసీ మృతి

కాకినాడ క్రైం: అనారోగ్యానికి గురైన ఓ ఎంపీటీసీ స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కిర్లంపూడి మండలం పాలెం ఎంపీటీసీగా స్వతంత్రంగా నెగ్గిన బొడ్డేటి లక్ష్మి (45) కొన్నాళ్ల క్రితం ఊపిరితిత్తుల అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రులలో వైద్యం చేయించి ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు కుమారుడు అప్పారావు లక్ష్మిని శనివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌కు తరలించి ఓల్డ్ ఎస్ఎస్ఆర్‌లో చేర్చాడు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన తల్లి మృతి చెందిందని అప్పారావు ఆరోపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: ప్రతాప్‌నగర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఉపకేంద్రం 11కేవీ అశోక్‌నగర్ ఫీడరు విద్యుత్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ ఆదివారం తెలిపారు. దీని వల్ల ప్రతాప్‌నగర్, రామారావుపేట, గాంధీనగర్, గొల్లపేట, గాంధీనగర్ పార్కు ఏరియా, ఎల్విన్‌పేట, చీడీలపోర, మహ్మద్ అలీ వీధి, రెడ్‌క్రాస్ స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పుష్పోత్సవం

కరప: యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. ఉత్సవం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ వంశపారంపర్య అర్చకులు పెద్దింటి సీతారామం పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో ఊయలలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను అందులో ఉంచి, తీపర్తి సత్యనారాయణ, సూర్యకుమారి దంపతులతో అర్చకులు సీతారామం పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు యశస్విని, సాయిశ్రీ చేసిన భరతనాట్యం అందరినీ అకట్టుకుంది. యండమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, కె.రఘు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి, ప్రసాద వితరణ చేశారు.



భరతనాట్యం చేసిన చిన్నారులకు స్వామి, అమ్మవార్ల ఫొటోను అందజేస్తున్న ఈఓ

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కాకినాడ: ప్రమాదంలో గాయపడి వైద్యఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న ఓ మత్స్యకార కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి బాసటగా నిలిచింది. కాకినాడకు చెందిన కర్రి చినగోవరాజు సముద్రంలో చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతని కుమారుడు ధనశేఖర్ రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తన ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా రూ.4 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును బాధితుడు ధనశేఖర్ తండ్రి చినగోవరాజుకు ఆదివారం రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అందజేశారు. తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీఎం సహాయ నిధి నుంచి సొమ్ము విడుదల చేయించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న వీరభద్రారెడ్డి